క్లుప్తంగా

వైభవంగా స్వాతి వేడుకలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగు పేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. లక్ష్మీదేవి అమ్మవారికి ఆకుపూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అర్చకులు రామానుజన్, దేవాలయ నిర్వాహకులు మధుసూదన్ రాయలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని పట్టు వస్త్రాలతో ముస్తాబు చేశారు. అనంతరం నవగ్రహ, గణపతి హోమాలు చేపట్టి పూర్ణాహుతి గావించారు. వేదపండితులు ప్రతాప్‌శర్మ,ఆలయ నిర్వాహకులు తిరువీధి సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ అభయాంజనేయస్వామి, ఇంజేడు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణ స్వామి, భాస్కరశర్మ, అనంతయ్యలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అనాథ పిల్లలు, వృద్ధులకు చేయూత

నంద్యాల(వ్యవసాయం): స్నేహితుల సహకారంతో నిరాశ్రయులైన వృద్ధులకు, పిల్లలకు తమవంతు సహకారాన్ని అందిస్తామని ఫ్రెండ్స్ ఫర్ సేవా సంస్థ అధ్యక్షుడు ఫణీంద్ర పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సాయీశ్వర నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలందరినీ ఆశ్రమంలో చేర్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనాథ పిల్లల విద్యాభివృద్ధి, వారి భవిష్యత్‌కు బాటలు వేస్తామని తెలిపారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా రేపు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు 590 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి శనివారం కో ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయాభివృద్ధికి విరాళం



ఈఓ రామానుజన్‌కు నగదు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణం, ఆయోధ్య నగర్‌కు చెందిన తోగటవీరక్షత్రియ జ్యోతి ఉత్సవ కమిటీ సంస్థ తరుపున సభ్యులు రూ.1,0,1116 విరాళాన్ని ఆలయ కార్య నిర్వాహణాధికారి రామానుజన్‌కు శనివారం అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులను రామానుజన్ అభినందించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శనివారం దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో రెడ్డివారిచక్రపాణిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అనుసరించి ఎలక్షన్ కమిషనర్‌తో ప్రత్యేక అనుమతి తీసుకుని ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థాన అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ సహాయ కమిషనర్ హెచ్‌జి వెంకటేష్, అన్ని యూనిట్ విభాగాల అధికారులు పర్యవేక్షకులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలోకి మహిళ

గతంలో మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నారు. ఓట్ల సమయంలో మాత్రమే వారికి తాయిలాలు ప్రకటించి, అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోకపోవడం రివాజుగా మారింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం నుంచి దాదాపు 95శాతానికి పైగా సంక్షేమ పథకాలు వారిపేరుతోనే అందజేస్తోంది. ఇక నామినేటెడ్ పోస్టులు, రాజకీయ పదవులు, కాంట్రాక్టులు ఒకటేమిటి అన్నింట్లోనూ వారికి సగానికి పైగా కేటాయింపులు చేపట్టింది. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో మహిళా మార్టులు ప్రారంభించనుంది. పాణ్యం, బేతంచెర్లలో ఉగాది నాటికి ప్రారంభించాలని నిర్ణయించింది. వారిని వాటాదారులుగా ఉంచి, తయారీదారులతో ప్రభుత్వమే నేరుగా చర్చించి వారికి తక్కువ ధరలకు వస్తువులు అందజేసేలా చర్యలు తీసుకుంది.

- జిల్లాలో రెండు మహిళా మార్ట్‌లు
- పాణ్యం, బేతంచెర్లలో ఏర్పాటు
- ఉగాది నాటికి ప్రారంభించేలా పనులు
- 18 వేల మంది మహిళలకు భాగస్వామ్యం
- తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు




బేతంచర్లలో మహిళా మార్ట్ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు (ఫైల్)

నంద్యాల: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో మహిళలే వాటాదారులుగా ఉంటూ అన్ని రకాల వస్తువులను విక్రయిస్తారు. తద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు వారికి అవకాశం కల్పిస్తారు. ప్రభుత్వం మహిళలను వ్యాపార రంగంలో భాగస్వాములను చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తోంది. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళలతో చేయూత మహిళా మార్టులను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసింది. నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల, పాణ్యం నియోజకవర్గాల కేంద్రాల్లో మహిళా మార్టులను ప్రారంభించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మహిళా మార్టుల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఒక్కో మార్టు రూ.35లక్షలతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. బేతంచర్ల మహిళా మార్టును ఉగాది నాటికి ప్రారంభించడానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. చేయూత మహిళా మార్టులో నిత్యావసర వస్తువులు మార్కెట్ రేటు కంటే తక్కువగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. బ్రాండెడ్ వస్తువులు, సరుకుల అమ్మకాలను చేపడతారు. వస్తువుల తయారీదారులతో ప్రభుత్వమే నేరుగా మాట్లాడి మహిళా మార్టులకు ఆయా వస్తువులు లేదా సరుకులను తక్కువ ధరలకు అందించేలా చర్యలు తీసుకుంటుంది. మహిళా మార్టులలో ప్రజలకు తక్కువ ధరకే వస్తువులు విక్రయించనున్నారు.

రూ.310తో షేర్ ధనం..

మహిళా మార్టు ఏర్పాటు చేసిన నియోజకవర్గ కేంద్రాల్లో ఆ మండలానికి చెందిన మహిళలే షేర్ ధనం రూపంలో పెట్టుబడి పెట్టడానికి అర్హులు. బేతంచర్ల, పాణ్యం నియోజకవర్గ కేంద్రాల్లో 18 వేల మంది మహిళలు భాగస్వాములుగా ఉన్నారు. వీరు మహిళా మార్టులో రూ.310 వాటా ధనంతో షేర్ పెట్టుబడి పెట్టారు. వీరందరికి భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లో నిత్యావసర సరుకులు, బ్రాండెడ్ వస్తువులు, దుస్తులు, గృహాలకు ఉపయోగించే వస్తువులు విక్రయిస్తారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పెట్టుబడి పెట్టిన మహిళలకు వాటాల ప్రకారం లాభాలను అందిస్తారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే..



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంది. జిల్లాలో ముందుగా పాణ్యం, బేతంచెర్లలో మహిళా మార్ట్‌లను త్వరలో ప్రారంభించనున్నాం. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా మార్టులు ఉపయోగపడుతాయి. ఇవి పూర్తిగా డ్వాక్రా మహిళల వాటా ధనంతో ఏర్పాటు చేస్తున్నాం. బ్రాండెడ్ వస్తువులు, నిత్యావర సరుకులు వాటిల్లో అందుబాటులో ఉంటాయి. బేతంచర్ల, పాణ్యం మహిళా మార్టును ఉగాది రోజు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

విద్యార్థులను బాగా చదివించాలి

రుద్రవరం: విద్యార్థులను ఇళ్ల వద్ద బాగా చదివించాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తల్లిదండ్రులకు సూచించారు. తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలంటే వారికి సెల్ ఫోన్లు ఇవ్వరాదన్నారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక బయట ఎక్కువ సేపు తిరగనివ్వకుండా చదివేలా చూడాలని చెప్పారు. కొందరు చదువు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మార్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ : గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.11,23,134 వసూలు చేయవలసి ఉండగా ఇప్పటి వరకు రూ.7,34,669లు మాత్రమే వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హరివరం, కొండుపల్లె, పుచ్చకాయలపల్లె, రూపనగుడి గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేపట్టిన కార్యదర్శులను అభినందించారు. నెలాఖరులోగా మిగిలిన గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు.

ప్రశాంతంగా ఓటు వేసుకోండి



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లపై సూచనలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

దొర్నిపాడు: ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. విద్యుత్, వెంటిలేషన్, ఫ్యాన్ల ఏర్పాటు వంటి వాటిపై హెచ్‌ఎం మహ్మద్‌హుసేన్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్లు క్యూలైన్ నిలుచేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయించాలని ఎస్‌ఐ తిరుపాల్‌కు సూచించారు. పట్టభద్రులు 525, ఉపాధ్యాయులు 19 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. వారు డివిడిగా ఓటు వేసేందుకు రెండు బూత్‌లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్భయంగా ఓటు వేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

శిరివెళ్ల: ఈ నెల 15వ తేదీన ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని యర్రగుంట్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 165 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 159 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్ష కేంద్రం చీఫ్‌గా తాను, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా మురళీమోహన్‌గౌడ్ నియమితులయ్యామని చెప్పారు. పరీక్షలకు సంబంధించి ఒక సెట్ పేపర్లు పోలీస్‌స్టేషన్‌కు చేరాయని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంతో పాటు ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించే సిబ్బందితో పాటు ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రాల్లో తాగునీరు, లైటింగ్, శానిటేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు. అనంతరం పట్టణానికి మంచినీరు సరఫరా చేసే పైపు లైను పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయని తెలిపారు. అలాగే.. సమ్మర్ స్టోరేజ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ పనులు పూర్తయ్యాయని, నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

అన్ని స్థానాల్లో విజయం సాధిస్తాం



యర్రగుంట్లలో పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ఈ నెల 13వ తేదీన జగనున్న పట్టభద్రులు, టీచర్లు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం యర్రగుంట్లలో పట్టభద్రులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. తద్వారా రాష్ట్రంలో 1.24 లక్షల మంది పట్టభద్రులకు ఉద్యోగాలు కల్పించామన్నారు. అలాగే 2.25 లక్షల మంది నిరుద్యోగులకు గ్రామ వలంటీర్ల పోస్టుల్లో నియమించామని చెప్పారు. ఇటీవల పోలీస్ శాఖలో 6వేల కానిస్టేబుల్, ఎస్‌ఐ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలైందని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ఇన్ని ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. విద్యావంతులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.కార్యక్రమంలో గంగుల విజయ సింహారెడ్డి, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఉమ్మషాగారి సలాం, సొసైటీ చైర్మన్ మేర్వ చిన్న నాగిరెడ్డి, దేవస్థానం చైర్మన్ మేర్వ జయనాగిరెడ్డి, లాయర్ రామిరెడ్డి, సత్తార్ పూల రామిరెడ్డి, పురుషోత్తం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్‌సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, వీరారెడ్డిపల్లె సర్పంచు మందాల శివారెడ్డి పాల్గొన్నారు.

వీటిని తొలగించేదెవరు?

- పాఠశాలలో బండల తొలగింపు వివాదాస్పదం
- ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా గదులకు అడ్డంగా బండలు
- తొలగించాలని సూచించినా తమ పరిధి కాదన్న హెచ్‌ఎం, కాంట్రాక్టర్
- మండిపడిన సీఐ రాజశేఖర్



టీచర్స్ పోలింగ్ కేంద్రం ఎదుట ప్రమాదకరంగా ఉన్న బండలు

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నాబార్డు నిధులతో ఎనిమిది తరగతి గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆ నిధులతో పాత తరగతి గదుల్లో బండలు తొలగించి పాలిష్ బండలు వేశారు. తొలగించిన పాత బండలను పాఠశాల ముందే వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతకూ ఆ బండలు ఎవరు తొలగించాలి? తొలగించే ఖర్చు ఎవరు భరించాలి? అనే సందేహం నేటి వరకు నెలకొంది. నేటికి రెండేళ్లవుతున్నా బండలను అలాగే వదిలేశారు. ఇప్పటి వరకు బండల తొలగింపును పట్టించుకోలేదు. అయితే శనివారం బండల తొలగింపు వివాదాస్పదంగా మారింది. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్కడి వచ్చి చూడగా ప్రమాదకరంగా ఉన్న బండలు కనిపించాయి. సీఐ స్పందిస్తూ వెంటనే ఈ బండలు తొలగించి శుభ్రం చేయించాలని హెచ్‌ఎంకు సూచించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తమకు సంబంధం లేదని, బండలు తొలగించిన కాంట్రాక్టర్ చేయాలని చెప్పారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి తొలగించాలని చెప్పగా.. ఆయన కూడా తనకు సంబంధం లేదని, తాను కొత్తగా పనులు చేస్తున్నాని సమాధానమిచ్చారు. పాత పనులను ప్రస్తుతం మీరే చేస్తున్నారు కదా మీరే తొలగించాలని మరోసారి సూచించగా.. వాటిని తొలగించాలంటే తనకు రూ.10వేల వరకు ఖర్చు అవుతుందని ఎవరు ఇస్తారని సదరు కాంట్రాక్టర్ ప్రశ్నించాడు. తర్వాత మాట్లాడొచ్చు కంట్రాక్టర్ ఫోన్ నంబర్ తీసుకోవాలంటూ ఎస్‌ఐ తిరుపాల్‌కు సూచించారు. ఫోన్ నంబర్ ఇచ్చేందుకు కంట్రాక్టర్ నిరాకరించడంతో సీఐ మండిపడ్డారు. దీనికి సంబంధించి ఎస్‌ఎస్‌ఏ ఏఈ శంకరయ్యను వివరణ కోరగా.. బండలు తొలగించే విషయం తమకు సంబంధం లేదని, ఆపని హెచ్‌ఎం చూసుకోవాలని చెప్పారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో శనివారం పలువురు ఉన్నతాధికారులు పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ రమణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజనేయులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే పోస్టల్ శాఖ జనరల్ మేనేజర్, బెంగళూరు పీఎం శరవణన్ కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజలు అనంతరం వారికి స్వామి అమ్మవారి ప్రసాదాలు అందజేసి వేదపండితుల ఆశీర్వచనం చేయించారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

గోస్పాడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జిల్లెల్ల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, మండల అధ్యక్షుడు సద్దల నాగజ్యోతీశ్వరరెడ్డి, జిల్లా కోశాధికారి బాలన్న కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మోహన్ మృతి చెందాడని ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డికి కలిసి వినతి పత్రం అందజేయగా.. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.15వేలు అందజేస్తారని, అలాగే రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా వస్తుందని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానంతో సరిపెట్టకుండా పార్లమెంట్ కమిటీ వేసి కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తీసుకోవాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోయల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శామ్యూల్ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించడం హర్షనీయమన్నారు. కమిషన్ రిపోర్టు రెండు రోజుల్లో ప్రభుత్వానికి చేరనుందన్నారు. ఈ రిపోర్టుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతారని, ఆ తరువాత పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు.నాయకులు సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటయ్య ఆలయం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఫాల్గుణ మాసం పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుండే కాకుండా తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి సమర్పించి మొక్కులు చెల్లించారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.12,60,387లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.



గుండుపాపల వద్ద మిర్చి దిగుబడిని ఆరబోస్తున్న రైతులు

మిర్చి ధర పైపైకి

దొర్నిపాడు: కొన్నిరోజులగా ఎండు మిర్చికి ఊహించనంత ధర లభిస్తోంది. పరిస్థితి అనుకులంగా ఉండటంతో వచ్చిన పంటను వచ్చినట్లే రైతులు కల్లాల్లోనే విక్రయిస్తున్నారు. కిలో లావు రకం రూ.500, సన్నాలు రకం రూ.300 ప్రకారం విక్రయిస్తున్నారు. నాణ్యతను బట్టి క్వింటా రూ.30వేల నుంచి రూ.50వేల వరకు పలుకుతోంది. ప్రస్తుతం ఎకరాకు 20 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తున్నాయి. మండలంలో 1,462 ఎకరాల్లో మిరప పంట సాగుచేశారు. ఇప్పటికే మొదటి కోతల్లో ఎకరాకు10 క్వింటాళ్ల వరకు వచ్చాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉండటంతో వ్యాపారులు కల్లాల్లోకి వెళ్లి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం చూపినా..

తొలుత పంటకు తామర, మొదుళ్ల కుళ్లు, ఎండు తెగులు వ్యాపించడంతో కొంత దెబ్బతినింది. తర్వాత తెగుళ్ల బెడద తగ్గినా దిగుబడులు తగ్గాయి. అయినప్పటికీ మంచి ధర పలకడంతో మిర్చి రైతులు కొంతవరకు ఊరట చెందుతున్నారు. ఎకరాకు రూ.1.50లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు పెట్టుబడులు వెచ్చించారు. ప్రస్తుతమున్న ధరతో ఎకరాకు రూ.5లక్షలకు పైగా ఆదాదయం వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలి



మత పెద్దల ప్రసంగాన్ని వింటున్న ముస్లింలు

కోవెలకుంట్ల: ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని కర్నూలుకు చెందిన మత పెద్దలు మౌలానా బసిత్‌సాబ్, మౌలానా రహంతుల్లా సూచించారు. స్థానిక ముదిగేడు చౌరస్తా సమీపంలోని షాదీఖాన ఆవరణలో శనివారం ఇస్తేమా నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన సుమారు 2 వేల మంది ముస్లిం సోదరులు ఇస్తేమాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోందన్నారు. ప్రతి ఒక్క ముస్లిం రోజు ఐదు పూటలా నమాజ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల, కోవెలకుంట్లకు చెందిన మత పెద్దలు ఖలీల్, రహిల్, యాసిన్ మౌలానా, సలామ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల నియంత్రణలో పక్షులు కీలకం



ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన పరీక్షను పరిశీలిస్తున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ, ఉద్యాన పంటల్లో పురుగులు, చీడపీడల నియంత్రణలో పక్షులు కీలకమని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు పక్షుల వల్ల కలిగే లాభనష్టాలను వివరించారు. పంటల్లో పురుగుల బెడదను నివారించుకునేందుకు కర్రలతో పక్షి స్థావరాలు ఏర్పాటు చేసి పొలంలో పసుపు కలిపిన అన్నం, బొరుగులు చల్లాలని తెలిపారు. కర్రలపై వాలిన పక్షులు నేలపై చల్లిన అన్నం, బొరుగులు తినేందుకు వెళ్లి పురుగులను కూడా తినేస్తాయన్నారు. పంటలు కంకిదశ, కాయదశలో ఉన్నపుడు పక్షుల వల్ల నష్టం జరుగుతుందన్నారు. ఒకే పొలంపై ఎక్కువ సంఖ్యలో పక్షులు వాలి గింజలు తినడం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అటువంటి సమయంలో పక్షుల బెడదను తగ్గించుకునేందుకు చనిపోయిన పక్షులను పొలంలో వేలాడదీయడం, మెటాలిక్ రిబ్బన్‌లు ఏర్పాటు చేయడం, టేపు రికార్డులతో సౌండ్ చేయడం, దిష్టి బొమ్మలు పెట్టడం చేయాలన్నారు. కంకులు, కాయలపై వేపనూనె పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కాగా ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సుపై మధ్యంతర పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో దేశీ కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

14న 'ఇమాం ఏ ఆజం అబూ హనీఫా'

కర్నూలు(రాజ్‌విహార్): ఇమాం ఏ ఆజం అబూ హనీఫా రజిఅల్లాహు అన్హు జీవిత చరిత్రపై ఈ నెల 14వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ అన్నారు. శనివారం స్థానిక పాతబస్తీలోని ఆ సంఘం కార్యాలయం మిలాద్ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమానవాళిని శాంతి వైపు నడిపేందుకు కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అహలే సున్నతుల్ జమాత్, సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు (మగ్రీబ్ నమాజు తరువాత) బుధవారపేట బ్రిడ్జి వద్ద ఉన్న ఎంఎస్ ఫంక్షన్ హాలులో గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జామియా నిజామియా నక్షబంది, ఖతీబే హిందుస్తాన్ అల్లమా మౌలానా మొహమ్మద్ అహ్మద్, ప్రముఖ మత గురువు మౌలానా ఆసిపుద్దీన్ ఖాద్రీ హాజరై ప్రసంగించనున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఈ సభకు హాజరై ఆధ్యాత్మికతను పెంపొందించుకొని అల్లాహ్ మార్గంలో నడుచుకోవాలని కోరారు. సమావేశంలో రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రీ, అహలే సున్నతుల్ జమాత్ కమిటీ ప్రతినిధి సయ్యద్ మాసుం పీర్ ఖాద్రీ, మహబూబ్ బాషా పాల్గొన్నారు.